తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఎన్సీసీ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్



తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాతవార్త:
తిరుపతి ఎన్సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయాన్ని ఎన్సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్సీసీ క్యాడెట్లు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. గౌరవ వందనం అందుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి ప్రధానాంశాలుగా బాధ్యతాయుతమైన పౌరులను దేశానికి అందించటంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. నాణ్యమైన శిక్షణ, నైపుణ్యాల బలోపేతం, సాహస కార్యక్రమాలు, కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రాజెక్టుల్లో పాల్గొనేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా, ఎన్సీసీ అధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు ఐశ్వర్యం...ఆయురారోగ్యం కలగాలి

### -పూర్ణాహుతితో ముగిసిన మహాయాగం



తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:
భక్తులు ఐశ్వర్యం, ఆయురారోగ్యం, సంపదలు కాంక్షిస్తూ చేపట్టిన సంగోపాంగ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం మధ్యాహ్నం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసింది. ధర్మగిరి శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠంలో నిర్వహించిన శ్రీనివాస విశ్వశాంతి మహాయాగంలో నాలుగురోజులుగా 32మంది వేదపండితులు పాల్గొని వేదపారాయణం, సుందరకాండ పారాయణం తదితర వైదిక క్రతువులు జరిపించారు. పూర్ణాహుతిలో టిటిడి ఈఓశ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# వచ్చేనెల మొదటి వారంలోపు పనులు పూర్తికావాలి

**సాఫీగా ప్రవేశ నిష్క్రమణ మార్గాలు -ట్రాఫిక్ సమస్యతలెత్తకుండా ప్రణాళికలు**

**బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టిటిడి ఈఓ శ్యామలరావు,అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**





తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:
మరోనెలరోజుల్లో తిరుమలలో ప్రారంభంకానున్న దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, పనులన్నీ వచ్చేనెల మొదటివారంలోపు పూర్తిచేయాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు మాఢవీధుల్లోని గ్యాలరీల్లోకి భక్తులు సాఫీగా చేరుకునేందకు వీలుగా ప్రవేశ నిష్క్రమణ మార్గాలు ఏర్పాటుచేయాలన్నారు. గ్యాలరీల నిర్వహణ చక్కగా ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని, బ్రహ్మోత్సవాల తొలిరోజే సిఎం చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు తీసుకువస్తారు కావున ఏర్పాట్లు మరింతగా పటిష్టం చేయాలన్నారు.గ్యాలరీల్లోనికి ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, అందులో ఉండే భక్తులకు సౌకర్యాలు, సదుపాయాలు,భద్రత పరంగా తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో తనిఖీలు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, టిటిడి విజిలెన్స్ విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్, తిరుమల సిఐలు విజయకుమార్, రాముడు,సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమతో కలసి టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు ఉంటాయన్నారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారని, అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. గరుడసేవరోజు భక్తులను ప్రశాంతంగా గ్యాలరీల్లోనికి అనుమతించడం, తూర్పుమాఢవీధిభక్తులు ఖాళీఅయిన తరువాత తిరిగి భక్తులను అనుమతించడం పటిష్టంగా ఉండాలన్నారు. రవాణావిషయంలో ఆర్టీసి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## దోమల నియంత్రణతోనే

# వ్యాధులు దూరం

**ప్రపంచ దోమల నియంత్రణ దినోత్సవ ర్యాలీలో ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ**




చిత్తూరుహెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త:
దోమలను నియంత్రించడం, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులు రాకుండా కట్టడి చేయవచ్చునని ఇన్‌ఛార్జీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవంను పురస్కరించుకుని బుధవారం ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ ఇన్‌ఛార్జీ కమీషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లతో కలిసి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంగళరావు కాలనీలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ దోమకాటు వల్ల పలు ప్రమాదకర విష జ్వరాలు వ్యాపిస్తాయన్నారు. పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూసుకోవడం వల్ల దోమలను నియంత్రించవచ్చునన్నారు. అలాగే దోమలు కుట్టకుండా ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జీ మున్సిపల్ కమీషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ దోమలను పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్ పకడ్బందీ చర్యలు తీసుకొంటున్నదన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ నగర పరిధిలో దోమలను పూర్తి స్థాయిలో కట్టడి చేయడానికి ఫాగింగ్, మాలథియాన్, స్ప్రేయింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేజర్ కాలువలో ఆయిల్ బాల్స్ వేసి స్ప్రేయింగ్ చేయించారు. అలాగే దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మలేరియా ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన సీఎం..




రేణిగుంట ఆగస్టు 20 ప్రభాతవార్త
రేణిగుంట విమానాశ్రయం వెళ్లే మార్గంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీలో బుధవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు చోట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి కేంద్రంగా వర్చువల్ విధానంలో తిరుపతి (రేణిగుంట) రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించారు. వర్చువల్ గా ప్రసంగం పూర్తయిన తరువాత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గొప్ప విజినరి ఉన్న నాయకుడిగా అభివర్ణించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన వెంటనే దాదాపు 1,60,000 మంది రిజిస్ట్రేషన్లు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. తిరుపతి ప్రాంతానికి ప్రముఖ దిగ్గజ కంపెనీ అదాని లీడ్ చేస్తుందని అన్నారు. మరో ప్రముఖ కంపెనీ అమరరాజ ముందుకు వస్తున్నది అన్నారు. యువ పారిశ్రామికవేత్తలు తమ స్కిల్స్‌ను ఉపయోగించుకోవడానికి వేదిక ఏర్పాటయిందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ టాటా సన్స్ ప్రధాన భాగస్వామిగా కావడం గొప్ప విశేషం అన్నారు. తిరుపతి నగరం జ్ఞాన నగరంగా అభివర్ణించారు. ఐఐటి, ఐసర్, మహిళ యూనివర్సిటీ, ఎస్ వి యూనివర్సిటీ, వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, త్రిబుల్ ఐటీ, కియా విశ్వవిద్యాలయం, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం, అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, సంస్కృత విశ్వవిద్యాలయం దాదాపు 14 జాతీయ, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. ఒకవైపు విద్యను ప్రసాదించడానికి యూనివర్సిటీలో ఉన్నాయని, మరోవైపు యువతకు ఉద్యోగాలు ఇవ్వడానికి ఇండస్ట్రియల్ పరంగా శ్రీ సిటీ, నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్, రేణిగుంట క్లస్టర్ వన్ క్లస్టర్ టు నందు కంపెనీలు, కృష్ణపట్నం పోర్టు అనుసంధానంగా క్రిస్ సిటీ ఉన్నాయన్నారు. కార్యక్రమం చివర్లో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మత్స్యశాఖ సెన్సార్ సింగ్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కేతన్ టెక్ బీస్, ఆటో కంపోస్ట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫోక్ లింక్, కార్బన్ సెల్స్, మనోడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఫైపర్ ఫైపర్ ఫిలిక్స్ రోబెటిక్ ప్రైవేట్ లిమిటెడ్, మైండ్ ట్రానిక్స్ జుమాంజి బాక్స్, రోబో మాక్ ఎన్ జి ఈ ఎన్ వాటర్ సొల్యూషన్స్, కోకో మంత్ర, ఎనర్జి ఎఫ్సీఎన్ ఎన్ఫోర్స్మెంట్ ఫ్రెండ్లీ ఫోరం, ఏ ఈ డి ఏ ఏ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పల్ప్రియో జ్యూస్ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య అప్పారావు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి,రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా టిడిపి సీనియర్ నేత చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర వడ్డెర సంఘం కార్యదర్శి దేవళ్ల రమణ, టిడిపి మండల ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో 29 బార్లు

### - డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ విజయశేఖర్



సూళ్లూరుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త
తిరుపతి జిల్లాలో నూతనంగా 29 బార్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తిరుపతి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ విజయశేఖర్ వెల్లడించారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. 29 బార్లలో మూడు బార్లు మాత్రం ఈడిగ, గౌడ కులాలకు కేటాయించారన్నారు. తిరుపతి మున్సిపాలిటీలో ఈడిగలకు, శ్రీకాళహస్తిలో గౌడ్‌లకు, గూడూరులో గౌడ్ కులస్తులకు ఈ బార్లు కేటాయించినట్లు చెప్పారు. బార్లకు దరఖాస్తులు చేసే వారు తిరుపతి జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఇందుకు సంబంధించి క్యాస్ట్, నేటివిటీ సర్టిఫికెట్లను అందజేయాలని చెప్పారు. బ్యాంకు గ్యారెంటీ కింద రూ.5 లక్షలు, బార్లు నిర్వహణకు 35 లక్షలు, కిస్తుల కింద ఆరు వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పించినట్లు విజయశేఖర్ తెలిపారు. ఒక్కొక్క బారుకు సంబంధించి నాలుగు దరఖాస్తులకు తగ్గకుండా రావాలని, లేనిపక్షంలో టెండర్లను వాయిదా వేసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 26 నుంచి టెండర్లను అందజేస్తామని, 29, 30 తేదీల్లో టెండర్లు దాఖలు చేయాలని ఆయన చెప్పారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి రెండు బార్లు మంజూరయ్యాయని, ఈ బార్లు మున్సిపాలిటీ పరిధిలో మూడు కిలోమీటర్లలో ఎక్కడైనా పెట్టుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డిపిఓ నాగమల్లేశ్వరరెడ్డి, సిఐ కె.సురేంద్రబాబు, ఎస్ఐలు ఎవి సురేష్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.67 కోట్లు ఆదాయం



కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.67 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. బుధవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా 23 రోజులకు గాను హుండీల ద్వారా 1,67,32,780 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 50 గ్రాముల బంగారు, ఒక కిలో 617 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిం ది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 16,236 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 41,450 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 397 అమెరికా డాలర్లు, 10 ఇంగ్లాండ్ ఫౌండ్, 230 యూఏఈ దినార్స్, 70 ఆస్ట్రేలియా డాలర్లు, 5 సింగపూర్ డాలర్లు,ఒక మలేషియా రింగిట్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి,ధనుంజయ, ధనపాల్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్ కోదండపాణి, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా జలాలతో

# 430 చెరువులకు నీళ్లు

### - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



పరమసముద్రం చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త
హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణా జలాలతో కుప్పం నియోజకవర్గంలోని 430 చెరువులను నీటితో నింపనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కుప్పంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. కుప్పం మండలంలోని హం ద్రీ-నీవా కాలువ పనులను, చివరి పాయింట్ అయిన పరమసముద్రం చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల సామర్థ్యం, చెక్‌డ్యాముల మరమ్మత్తులు, నీటి నిల్వలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. త్వరలో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా పరమసముద్రం చెరువు వద్ద బహిరంగ సభ, జలహారతి, పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తెలుగుగంగ ప్రాజెక్ట్ సిఇ వం ్రప్రసాద్, హెచ్ఎస్ఎస్ఎస్ ఎస్ఇ విఠల్ ప్రసాద్, డిఇఇ గోవర్ధన గిరిధరరావు, రిత్విక్ ప్రాజెక్ట్ సంస్థ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆస్పత్రిలో రాష్ట్రం లోనే తొలిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి) ముఖ్య కేంద్రాన్ని పరిశీలించారు. వివిధ పిహెచ్‌సిలో ఏర్పాటైన డిఐఎన్‌సి విధానం సరిగ్గా పనిచేస్తోందా లేదా అని అడిగి తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.కార్యక్రమాల్లో డిఎంహెచ్ఓ గంగాదేవి, ఎంఎస్ డా॥ విజయకుమారి పాల్గొన్నారు.

## ఏడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని

# మార్గదర్శిగా నిలిచిన తిరుపతి కమిషనర్




తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 20, ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఏడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచారు. పేదలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలని ఉద్దేశ్యంతో చేపట్టిన పి4 కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య భాగస్వాములై నిరుపేదలైన ఏడు కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. బుధవారం ఆ కుటుంబ సభ్యులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి వివరాలు తెలుసుకుని చలించిపోయారు. ఓ చిన్నారికి తండ్రి, తల్లి లేకపోవడం తెలుసుకుని, మీ కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేని చిన్నారికి విద్యను, తండ్రి లేని ఇద్దరు పిల్లలకు, తండ్రి లేని మరో బాలికకు విద్యను, అందిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు లేని ఓ కుటుంబానికి ఇల్లు ఇప్పిస్తానని, జీవనోపాధి కోసం ఒకరికి తోపుడు బండి, కిరాణా షాపు పెట్టుకునేందుకు తను ఆర్థికంగా సాయం అందించేందుకు కమిషనర్ ఎన్.మౌర్య అంగీకరించారు. ఇందుకు బంగారు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశారు. నగరంలోని పేదలను (బంగారు కుటుంబాలు) ఏదో విధంగా సాయం చేసేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

# రౌడీయిజాన్ని ఎన్‌డిఏ ఉపేక్షించదు

### - గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



గూడూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త
గూడూరు రౌడీయిజాన్ని ఎన్‌డిఏ ఉపేక్షించదు అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత ఖైదు అనుభవిస్తున్న అవిలేల శ్రీకాంత్ పెరోలుకి నేను ఇచ్చిన సిపార్సు లెటర్ ప్రభుత్వం రిజెక్ట్ చేసిందన్నారు. గూడూరు ఎమ్మెల్యేగా నేను ఇచ్చిన లెటర్‌తో శ్రీకాంత్‌కి పెరోలు ఇవ్వలేదు అని పేర్కొన్నారు. శ్రీకాంత్ తల్లి ఆరోగ్యం సరిలేదని గ్రీవెన్స్ లో నాకు అర్జీ ఇవ్వడంతో లెటర్ ఇచ్చానే తప్ప వేరే ఆలోచనతో ఇవ్వలేదన్నారు. పేద ప్రజలు వచ్చి కష్టాలు చెప్పుకుంటే మనసు చలించి లెటర్స్ ఇస్తానే తప్ప వేరే ఉద్దేశ్యం లేదు అని తెలిపారు. పెరోలు ఎవరు సిపార్సుచేస్తే ఇచ్చారో ప్రభుత్వం విచారణ చేపడుతుందనీ తెలిపారు. తప్పు చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలని నా పై ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర రాజు, నెలబల్లి భాస్కర్ రెడ్డి, చిన్న వై.ఎస్సార్, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పిళ్లారి పండుగకు సిద్ధమౌతున్న దక్షిణ కైలాసం

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)
శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకుసిద్ధమౌతుంది. ఈ ఏడాది దేవస్థానం స్వతహాగా రాజగోపురం పక్కన కార్‌పార్కర్‌లో భారీ వినాయకుని ప్రతిష్టించుటకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అలాగే నవసంధి వినాయకులకు సారె ఇచ్చే సంప్రదాయం ఇక్కడ ఉంది. శ్రీకాళహస్తిలోని మూల మూలల్లోనూ, నాలుగుమాడావీధుల్లోనూ వినాయచవితి సంబరాలకు భారీ ఎత్తున వినాయక చవితి సంబరాలు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. గత 25 సంవత్సరాలుగా వినాయకచవితి సంబరాల్ని హైదరాబాదును మరిపించే విధంగా నిర్వహిస్తున్నారు.'ఈ ఏడాది 'దేవస్థానం స్వతహాగా పార్కింగ్ చోట భారీ వినాయకుని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.' ఇందులో ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం,పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. చవితి సంబరాలు 5 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అంతేకాక పట్టణంలోని సుమారు ఐదు వంద చోట్ల వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు,ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది.

**ప్రైవేటు వ్యక్తులచే ఏర్పాట్లు:**

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ప్రైవేటు వ్యక్తులు తాము వసూలు చేసిన మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అంతేకాక పట్టణంలో నెలకొన్న పరిస్థితి దృష్ట్యా గతంలో 'వినాయక చవితి సంబరాల నిర్వహణ' కమిటి ఏర్పాటు చేశారు. ఇప్పటికే పట్టణంలోని వీధి వీధుల్లో చవితి సంబరాలకు పందిళ్ళు రోడ్ల మీద వెలిశాయి.సంబరాలకు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే బేరివారి మండపం వద్ద చవితి సంబరాలకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ లోకకళ్యాణార్థం హోమాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ ఏడాది ఇక్కడ మట్టి వినాయక ప్రతిమను బెంగుళూరు నుంచి తెప్పిస్తున్నారు. ఇక పెండ్లిమండపం వద్ద 14 అడుగుల వినాయకుని' రూపకల్పన చేసారు.ఈఈ మేరకు వీధి వీధికి వినాయక చవితి నిర్వహణకు, వినాయకుని ప్రతిమను ప్రతిష్టించుటకు పందిళ్ళు సిద్ధమౌతున్నాయి.



శ్రీకాళహస్తిలో వినాయక చవితికి సిద్ధ మౌతున్న వినాయకులు

**దేవస్థానంచే సారె:**

వినాయక చవితి సందర్భంగా నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయక ఆలయాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందించే సంప్రదాయం ఉంది.ఈ నేపథ్యంలో ఈ నెల 27 న ఉదయం దేవస్థానం నుంచి సారె అందించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ప్రకటించారు.హిందువులకు మొదటి పండగ పిళ్ళారి పండుగ కాబట్టి యువకులు అనందోత్సాహాలతో నిర్వహించుటకు పరుగులు తీస్తున్నారు.

## వైకాపా తప్పుడు ప్రచారాలు మానుకోవాలి : గౌనివారి

శాంతిపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న వైకాపా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. అమరావతి నగరం, పొన్నూరును ముంచేశారని, బుడమేరుకు వరద వచ్చి పొలాలు ముంచేశారని ప్రచారాలు చేయడం దారుణమన్నారు. మామిడి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుని గిట్టుబాటు ధరలు కల్పించిందనే విషయాన్ని తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. గత ంలో సైతం వరద సహాయక చర్యలపై 23కోట్లు ఖర్చు పెట్టారని గగ్గోలు పెట్టారన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణంపై సైతం తప్పుడు ప్రచారాలను పెయిడ్ ఆర్టిస్టులతో చేయిస్తున్నారని ఇలాంటి నీచమైన పనులను వైకాపా మానుకోవాలని హితువు పలికారు.

## రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

చెన్నై – బెంగళూరు రైలు మార్గంలో లెవెల్ క్రాసింగ్, తంబిగానిపల్లి వద్ద రైల్వే అండర్ పాస్ వంతెనలు నిర్మించాలని కోరుతూ బుధవారం రైల్వే డీఆర్ఎంకు మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రాజారా ం, గిరిధర్ బాబు, రవి, కదిరప్ప తదితరులు వినతిపత్రాన్ని అందించారు. అండర్‌పాస్‌వంతెనలే కుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనిడిఆర్ఎంకువారు వివరించారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు పొందాలి : డిఎస్పీ



కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతులు పొందాలని కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. వీటికోసం కొత్తగా పోలీసుశాఖచే ఏర్పాటుచేసిన గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లోదరఖాస్తు చేసుకోవా లన్నారు. దరఖాస్తుదారులకు ఒటిపి వస్తుందని దాన్ని వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే దరఖాస్తు ఫారం అందుతుందన్నారు. దాన్ని తగిన వివరాలతో భర్తీ చేస్తే ఆయా ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందుతుందన్నారు. అనంతరం తమ అధికారులు సంబంధిత ప్రాంతాలకు వెళ్లి పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరుచేస్తామన్నారు. కుప్పం సబ్ డివిజన్ పరిధిలో మూడు రోజులు మాత్రమే ఉత్సవాలను అనుమతిఇవ్వడంజరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని సూచించారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు..పరికరాలు పంపిణీ

రామకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం అలిమ్కో సంస్థ ద్వారా దివ్యాంగులకు మంజూరు చేసిన ట్రైసైకిళ్లు, ఇతర పరికరాలను బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్ లో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్దిదారులకు పంపిణీ చేశారు. రామ కుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన 1465మందికి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో కుప్పం నియోజకవర్గ ంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న 87 మంది లబ్దిదారులకు ఉచితంగా నేతలు సీలింగ్ ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులురాజు, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, నేతలు మునసా ్వమి, పట్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనే యరెడ్డి, రామూర్తి, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ, గుర్రప్ప, వెంకటరామగౌడు, రఫీ, విశ్వనాథ్, మనో హర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్ భవన నిర్మాణంకు భూమిపూజ

రామకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త



మండల కేంద్రంలో నూతనంగా అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేసి పనులు ప్రారంభిం చారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో అన్నక్యాంటీన్ నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులురాజు, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, నేతలు మునసా ్వమి, పట్ర నారాయణ, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, సీతాపతి, చలపతి, రామకృష్ణప్ప, చిన్నికృష్ణ,గుర్రప్ప, వెంకటరామగౌడు, రఫీ, విశ్వనాథ్, మనోహర్, రఘు, రామలింగారెడ్డి, పాల్గొన్నారు.

## వినాయక ప్రతిష్టకు ఆన్‌లైన్‌లో అనుమతులు



పెనుమూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త:

వినాయకచవితి పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటుకు పోలీసు అనుమతులు తీసుకోవాలని, ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌ఐ వెంకట నరసింహ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద డిజెలు ఏర్పాటు చేయడం నిషేధం అన్నారు. వినాయకచవితి ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటే వాటిని పోలీసుశాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తోందన్నారు. అనుమతులు లేకుండా ప్రతిమలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## అర్హత వున్న ప్రతి ఒక్కరికి పెన్షన్



– పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త:

అర్హత వున్న ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీనగర్ కాలనీలోని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, నియోజకవర్గ పరిధిలోని ఎంపిడిఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో పెన్షన్ల తొలగింపు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హత వుండి పెన్షన్ తొలగించిన వారి జాబితా, అర్హత లేకపోయినా పెన్షన్ పొందుతున్న వారి జాబితాపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రజల హక్కుల విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో అర్హత వున్న ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరయ్యే వరకు తాను నిరంతరం పర్యవేక్షిస్తానన్నారు. పూతలపట్టు నియోజకవర్గ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సత్వరం మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు

– డ్వామా ఎపిడి సుబ్రమణ్యం




యాదమరి, ఆగస్టు 20 ప్రభాతవార్త:

పాడి రైతుల ఉపయోగార్థం మండలానికి మంజూరు చేసిన మినీ గోకులం షెడ్ల నిర్మాణా లను వేగవంతంగా చేపట్టి పూర్తిచేయాలని డ్వామా ఎపిడి సుబ్ర మణ్యం అన్నారు. యాదమరి ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మినీ గోకులం షెడ్లు మంజూరైన పాడి రైతులతో డ్వామా ఎపిడి సుబ్రమణ్యం, ఎంపిడిఓ వేణు, ఎపిఓ సంధ్యలు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిడి సుబ్రమణ్యం మాట్లాడుతూ పాడి పశువులు ఎండ, వానలో తడవకుండా వుండటానికి ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేస్తోందన్నారు. మండలానికి కొత్తగా 190 మినీ గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని ఈ షెడ్లను ఉపాధి సిబ్బంది ఇచ్చిన సూచనల మేరకు నిర్మించుకోవాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులను అప్‌లోడ్ చేస్తే లబ్దిదారుల బ్యాంకు ఖాతాకు నిధులు జమ అవుతాయన్నారు.

## నమ్మి ఇంట్లో పెట్టుకున్నందుకు దొంగతనం చేసి పరార్

సదుం, ఆగస్టు 20, ప్రభాతవార్త : నమ్మి ఒక వ్యక్తిని ఇంటిలో పెట్టుకున్నందుకు అతను ఇంటిని దోచుకుని వెళ్లిన సంఘటన సదుం మండలంలో జరిగింది. ఎస్సై షేక్షావలి తెలిపిన మేరకు పీలేరు మండలం కోటపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు విశ్వనాథ్‌కు సదుమండలం మరువపల్లె పంచాయతీ చీకలు చేనుకు చెందిన సుధాకర్ అనే వ్యక్తితో పరిచయం ఉంది. రెండు రోజుల క్రితం అతను సుధాకర్ ఇంటికి వచ్చాడు. ఇంటి వద్దనే ఉండేవాడు. ఈనెల 18న సుధాకర్ అతని భార్య నిర్మల తిమ్మానాయనిపల్లి పంచాయతీ కొర్లకుంటవారిపల్లెకు పొలం పనులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించి ఇంట్లో ఉన్న విశ్వనాథ్ బీరువా తాళాలు తీసుకుని బీరువాలో ఉన్న 97 గ్రాములు బంగారు వస్తువులు అదేవిధంగా ఇంటి వద్ద ఉన్న పల్సర్ వాహనాన్ని దొంగలించుకుని వెళ్ళిపోయాడు. ఇంటికి వచ్చి చూసిన సుధాకర్ భార్య నిర్మల లబోదిబోమని చుట్టుపక్కల వెతికారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అగ్రికల్చర్ సిబ్బందితో సమావేశం




తాసిల్దార్ రమేష్ బాబు

పూతలపట్టు, ఆగస్టు 20, ప్రభాతవార్త

మండల పరిధిలో తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం అగ్రికల్చర్ సిబ్బందితో తాసిల్దార్ రమేష్ బాబు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈరోజు నుంచి గ్రామ సభలు నిర్వహించాలి అని సూచించారు. మామిడి రైతులు లిస్టు తయారు చేసి ఆధార్ కార్డు బ్యాంకు అకౌంట్ లింక్ లేని వాళ్ళకి లింక్ చేయాలని ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని వివరించారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు సబ్సిడీ ఒక కిలోకు నాలుగు రూపాయలు ప్రభుత్వం రైతుకు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మధురవాణి అగ్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మణికంఠేశ్వరాలయంలో ఘనంగా ప్రదోషకాల పూజ

కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో బుధవారం ప్రదోషకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా ఆలయంలో త్రయోదశి రోజున ప్రదోషకాల సమయంలో మణికంఠేశ్వరాలయంలో ప్రదోష కాల పూజలను నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## మూడవ విడత ఐటిఐకి దరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త :

పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరడంకు ఆసక్తిగల అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్ జి.సుబ్రమణ్యం తెలిపారు. ఐటిఐలో చేరడంకు ఆశక్తిగల అభ్యర్థులు ఆగస్టు 26 సాయంత్రం 5 గంటల లోపు ఐటిఐ.యన్‌సిఐ.ఇన్ వెబ్‌సైటు నందు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. కంప్యూటర్ కోర్సు, డ్రస్ మేకింగ్, మోకానిక్ డీజల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్ కోర్సులలో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 27 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు సర్టిఫికేట్లు పరిశీలన చేయించుకోవాలని చెప్పారు. అలాగే ఆగస్టు 29 ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ జరుగుతుందని అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకుని హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 9533723022, 9492571731 సంప్రదించాలని తెలిపారు.

## చిన్న దోమ - పెద్ద ప్రమాదం




కల్లూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త

చిన్న కీటకమైన దోమ వలన మానవాళికి పెద్ద ప్రమాదం ఉందని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పులిచెర్ల గ్రామములో ఆయన ఆధ్వర్యాన ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవమును జరుపుకుంటామని, అందుకు కారణం ఇదే దినమున 1897లో బ్రిటీష్ వైద్య శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి మనుషులకు దోమల ద్వారా వ్యాపిస్తుందని శాస్త్రీయంగా నిరూపించారని, ముఖ్యంగా ఆడ అనాఫిలిస్ దోమలు ప్లాస్మోడియం అనే పరాన్నజీవిని మానవ శరీరంలోకి ప్రవేశపెట్టి మలేరియాను వ్యాపింపజేస్తాయని ఆయన కనుగొన్నారన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, గ్రామాల్లో నిల్వ నీరు లేకుండా చేయటం ద్వార దోమల వృద్ధిని అరికట్టవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పర్యవేక్షకులు పురుషోత్తం, సిబ్బంది జయప్రకాష్, జ్యోతికుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర వాలంటీర్లకు శిక్షణ

సదుం, ఆగస్టు 20, ప్రభాతవార్త



సదుం మండలం వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర వాలంటీర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో 1890 మంది చదువురాని మహిళాలను గుర్తించినట్లు ఎంఈఓ దామోదర తెలిపారు .వారికి 189 మంది వాలంటీర్ల ద్వారా మండలంలో వంద రోజులు లేదా మార్చిలోగా చదువు నేర్పించి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.బుధవారం 189 మంది వాలంటీర్లలో 90 మంది వాలంటీర్లకు అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ మరియు వెలుగు డిపార్ట్మెంట్ సంయుక్తంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ క్లస్టర్ సూపర్వైజర్ గుణశేఖర్ రెడ్డి, మండల ఏపీఎం హరిప్రసాద్, వెలుగు సీసీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సదుంలో ప్రపంచ దోమల దినోత్సవం



సదుం, ఆగస్టు 20, ప్రభాతవార్త

చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సదుము మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ చరణ్, డాక్టర్ గాయత్రిల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చరణ్ మాట్లాడుతూ దోమల వలన కలిగే వ్యాధుల పై అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని చెప్పారు. దోమల వలన మలేరియా, చికెన్ గున్యా, డెంగే, మెదడువాపు వంటి వ్యాధులు కలిగే ప్రమాదం ఉంటుందని, తెలిపారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. అందరూ దోమతేరలు వాడుకొని దోమకాటు నుండి రక్షణ పొందాలని తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రి సిబ్బంది చేత దోమల నిర్మూలన పై ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమం లో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంత, జానకి, శిఖామణి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ రషీద్, జానకి, శివాని, దీప,మనీషా, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, సరస్వతి, నాగరత్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోమల నివారణతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

సోమల, ఆగస్టు 20, ప్రభాతవార్త



దోమల నివారణతో మలేరియా లాంటి వ్యాధులను నివారించవచ్చని తాసిల్దార్ మధుసూదన్ అన్నారు. ఆగస్టు 20 ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక వైద్యశాల నందు వైద్యాధికారి బాలాజీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అటవీ సమీప ప్రాంతాలైన పెద్ద ఉప్పరపల్లి తదితర గ్రామాల్లో దోమలు అధికంగా ఉంటాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. తాసిల్దార్ మాట్లాడుతూ మురుగునీరు నిలవకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఉదయభాస్కర్, సూపర్వైజర్ చంద్రమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తెదేపా సంస్థాగత పదవులపై ఐవిఆర్ఎస్ సర్వే

కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీలో సంస్థాగతంగా ఉన్న పార్టీ పదవులు ఎవరికి కట్టబెట్టాలనే అంశంగా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం ప్రజలు, కార్యకర్తలనుంచి ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా అభిప్రాయసేకరణ చేస్తోంది. కుప్పం టిడిపిమున్సిపల్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న కాణిపాకం వెంకటేష్, సత్యేంద్రశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ మునెప్పలపై సర్వే జరుగుతోంది. అలాగే కుప్పం గ్రామీణ మండల పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న రాజగోపాల్, ధనశేఖర్, జెకె సంతోష్‌లపై అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు.అలాగే రామకుప్పం మండల అధ్యక్ష పదవి ఆశిస్తున్న నాయకులు రామూర్తి, వెంకటరమణల పేర్లపై సర్వే జరుగుతోంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమగ్ర రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం : ఆర్డీఓ భవానీ

చౌడేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త



సమగ్ర రీసర్వేతో భూసమస్యలు పరిష్కారమవు తాయని పలమనేరు ఆర్డీఓ భవానీ అన్నారు. స్థానిక మండల పరిపాలనాభవనంలోని తహశీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై వీఆర్వోలు, రెవిన్యూ అధికారులతో సమావేశం జరిగింది. డివిజన్ వ్యాప్తంగా తొలుత రెవిన్యూ గ్రామాల పరిధిలో భూమిని రీసర్వే చేయడం జరుగుంతుందన్నారు. అనంతరం ప్రభుత్వ భూములు అయిన చెరువులు, వాగులు, వంకలు వంటివి, తర్వాత రైతులకు చెందిన పట్టా భూముల్లో సర్వే చేయడం జరుగుతుందన్నారు. గతంలో విధంగా అన్నీ కలిపి ఒకేసారి చేయడం జరగదన్నారు. చౌడేపల్లి మండలంలోని 15రెవిన్యూ గ్రామాలకు గాను 13గ్రామాల్లో సర్వే చేయాల్సి వుందన్నారు. రీసర్వేను సగ్రమంగా, సకాలంలో చేపట్టేలా తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నెలల్లో అన్ని సర్వేలు పూర్తి కావాలన్న ఉన్నతాధికారులు లక్ష్యాలను అధిగమించాలని పిలుపునిచ్చారు. చౌడేపల్లి పెద్దచెరువు నుంచి చిట్రెడ్డిపల్లి చెరువుకున్న రాజకాలువ దురాక్రమణకు గురైందని ఆమె దృష్టికి తీసుకురాగా విచారణ జరిపించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. తహశీల్దార్ పార్వతి, వీఆర్వోలు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## విషసర్పం కాటేసి వ్యక్తికి అస్వస్థత

చౌడేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త




విషసర్పం కాటేసిన వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు అనే వ్యక్తి మేస్త్రీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఓ వ్యక్తియొక్క ఇంటి పనిచేస్తుండగా విష సర్పం కాటేసింది. అపస్మారక స్థితిలో వున్న అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్సా నంతరం 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## సర్పంచుల్లో తలమానికం భాగ్యవతి



–అవార్డుగ్రహీతకు ఘన సన్మానం

చౌడేపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త

సర్పంచుల్లో తలమానికం గడ్డంవారిపల్లి సర్పంచు భాగ్యవతిహరినాథ్ అని పలువురు కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గడ్డంవారిపల్లి సర్పంచు భాగ్యవతిహరినాథ్‌కు ఢిల్లీలోని ఎర్రకోటలో జలశక్తి అభియాన్ ఆధ్వర్యంలో అవార్డునందించారు. దీంతో మండల వైకాపాచే స్థానిక జంగాలపల్లి రమణ భవనంలో వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండదండలతో సర్పంచుగా సేవలందిస్తున్న భాగ్యవతికి అరుదైన అవార్డు రావడం మండలానికి గర్వకారణమన్నారు. వాటర్‌షెడ్ పనుల్లో నాణ్యతతోపాటు ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించినందుకు అరుదైన గౌరవం లభించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. వైకాపా నాయకులు సుధాకర్‌రెడ్డి, రుక్మిణమ్మ, పవన్‌రాయల్, కృష్ణారెడ్డి, శ్రీరాములు, రెడ్డెప్పరెడ్డి, ఆసాది వెంకటపతి, బ్యాంకు రెడ్డెప్ప, జంగాలపల్లి రమణ, భాస్కర్, షంషీర్, చెంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి : సిపిఐ

పలమనేరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:



ఒంగోలులో ఈ నెల 13 నుండి 25 వరకు జరిగే రాష్ట్ర స్థాయి 28వ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గంగమ్మతోపులో సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు పోస్టర్లు విడుదల చేశారు. మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఏర్పాటైందని అప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఈ మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణా రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే కూనం సాంబశివరావు తదితరులు హాజరవుతారని, పలమనేరునియోజకవర్గంనుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు హజరు కావాలని కోరారు.

## పలమనేరులో లాడ్జీలపై పోలీసులు ఆకస్మిక దాడులు

పలమనేరు టౌన్, ఆగస్టు 20, ప్రభాతవార్త:

పలమనేరులో లాడ్జీలపై ఎస్ఐ స్వర్ణతేజ బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి లాడ్జి గదుల్లో ఉన్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లాడ్జి గదుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో దాడులు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాడ్జీల్లో గదులు తీసుకునే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డులు చూపాలని, ఎక్కడ నుండి ఏ పనుల మీద వచ్చారో వివరాలు తెలియ జేయాలన్నారు. అనుమానాస్పదంగా ఉన్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు

## కాణిపాకం ఆలయానికి రెండు టీవీలు విరాళం

కాణిపాకం, ఆగస్టు 20 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు గురువారం రెండు టీవీలను విరాళంగా అందజేశారు. చిత్తూరు విన్సన్స్ అధినేత రవీంద్రనాథ్ అనే భక్తుగు సుమారు 1,20 లక్షలు విలువగల 55 ఇంచ్‌ల రెండు టీవీలను విరాళంగా అందజేశారు. దాతలు ఈ టీవీలను ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, ఏఈ పవన్‌లతో పాటు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ

తవణంపల్లె, ఆగస్టు 20 ప్రభాతవార్త:




మండల కేంద్రం తవణంపల్లెలో బుధవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు సీహెచ్‌ఓలు జ్ఞానశేఖర్, రాజామణిల ఆధ్వర్యంలో మండల వైద్యసిబ్బంది స్థానిక పీహెచ్‌సీ నుండి తవణంపల్లె పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం టి.పుత్తూరు క్రాస్‌లో మానవహారం నిర్వహించారు. "దోమలు పుట్టకూడదు–దోమలు కుట్టకూడదు" "దోమ తెరలు వాడాలి–దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి" "ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి" ఇంటి పరసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలి, దోమల మోత, మనకు జ్వరాల వాత,మలేరియా, డెంగ్యూ వ్యాధి అంతం–మనపంతం అంటూ వారు నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండలంలోని పీహెచ్ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు గోపి, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

తవణంపల్లె, ఆగస్టు 20 ప్రభాతవార్త:



పొగాకు నియంత్రణలో భాగంగా మండలంలో అత్యధిక సంఖ్యలో సంతకాలు సేకరించిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహకరంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. గత నెల 1 నుండి 21 వరకు పొగాకు నియంత్రణలో భాగంగా 7,8,9, తరగతుల విద్యార్థులకు పొగాఆకు వ్యతిరేక సంతకాలు సేకరణ బాధ్యతలు అప్పగించారు.ఈమేరకు పొగాకు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిజ్ఞను ప్రజలకు తెలియజేసి అత్యధిక సంతకాలు సేకరించిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి హేమలత చేతుల మీదుగా ఈబహుమతులను అందజేశారు. ఈమేరకు మొదటి బహుమతి కె.మోనిత్‌కుమార్ ఆచ్చారి(7వ తరగతి), టి.మొహిధర్ (8వ తరగతి), పి.శేఖెత్ కుమార్‌రెడ్డి(9వ తరగతి)లకు బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్తలు టి.లావణ్య, శిల్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

సదుం, ఆగస్టు 20, ప్రభాతవార్త

మండల పరిధిలో ఒక యువతి అదృశ్యమైన సంఘటన జరిగిందని దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్షావలి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మండల పరిధిలోని ఇంద్రమ్మ కాలనీలో నివాసం ఉండు నిమ్మనపల్లి వెంకటరామయ్య కూతురు శ్రావణి 19 తేదీ ఉదయం నుంచి కనబడలేదు. దీంతో ఆమె తండ్రి పలుచోట్ల వెతికి కనపడకపోవడంతో సదుం పోలీసులును ఆశ్రయించారు. బుధవారం ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# తిరుపతి డివిజన్

## పోలీసు స్టేషన్ల సమీపంలో చోరీకి యత్నం



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తిరూరల్, తొట్టంబేడుపోలీసు స్టేషన్లు, పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఓ దుకాణం తలుపులు పగుల గొట్టి బీగాలు విరచి చోరికి ప్రయత్నిం చిన సంఘటన బుధవారం వేకువ జామున చోటు చేసుకున్నట్లు సమాచారం శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట మునస్వామి అనే నిరుపేద బతుకు జీవనం కోసం టీ కొట్టు ఏర్పాటు చేసుకున్నారు.ఇక్కడే ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసుస్టేషన్లు ఉండటంతో ఆ గూడులోనే జెరాక్స్ సెంటర్,పాలవ్యాపారాలు సాగించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం యథావిధిగా షాపుమూసి ఇంటికి వెళ్ళారు.బుధవారం ఉదయం 9 గంటలకు షాపు తెరవటానికి రాగా తలుపులను విరిచేసి ఉండటం బీగాలు పగులగొట్టి ఉండటంను గుర్తించారు. ఇది దొంగల పనే అని వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.ఈ సంఘటనపై వన్‌టౌన్ సిఐ డి.గోపి వారి సిబ్బందితో పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## పరశురామేశ్వరుని సేవలో తెలంగాణ అధికారి



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 20 ప్రభాతవార్త ఏర్పేడు మండలంలోని ప్రముఖ శివాలయం పరశురామేశ్వరుని సేవలో బుధవారం తెలంగాణ గ్రానైట్స్ ఎస్‌పి రాఘవేంద్రరెడ్డి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఒ రామచంద్రారెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో స్వామి వారి దర్శనానంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. వారు ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకాన్ని పరిశీలించి రూ.5వేలు విరాళం అందించారు.

## రక్తపోటు యంత్రాలు అందజేత



**తిరుపతి హెల్త్, ఆగస్టు 20 ప్రభాతవార్త :** వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సహకారంతో తిరుపతిలోని అన్ని వాకర్స్ అసోసియేషన్లకు దాదాపు రూ. 2లక్షలు విలువ జేసే వంద బీపీ సూచించు యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక సరోజనీదేవీ రోడ్డులోని వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్కాట్ కృష్ణప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. తిరుపతిలో 15 వాకర్స్ అసోసియేషన్లకు వంద బీపీ యంత్రాలను అందజేసినట్లు తెలిపారు. దీని వలన సభ్యులు నేతలు ప్రతి రోజు బీపీ చెక్ చేసుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ నారాయణాద్రి ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్ ముని, ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయుడు, శివగణేష్, వాకర్స్ అసోసియేషన్ శివారెడ్డి, వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ అనసూయమ్మ, సీతమ్మ, వాకర్స్ అసోసియేషన్, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు రద్దు చేసిన పింఛన్లు కొనసాగించాలి : సీపీఐ



**పుత్తూరు రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా పుత్తూరు అంబేడ్కర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం పోయి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం పోయి వికలాంగుల నూరు కొట్టే విధంగా రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని వెంటనే వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ నాయకులు చంద్రబాబు, గోపి, శరవణ, కృష్ణారెడ్డి, రమేష్, రమణ, వెంకటరత్నం, సల్వా రాజాచారి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



**పుత్తూరు రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం పుత్తూరు పట్టణ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... పట్టణానికిచెందిన గణేష్ కుమారుడు శ్రావణ కుమార్(32), నాగలాపురంలోనే ఈ వేదనారాయణ స్వామి ఆలయంలో నాధస్వరం కళాకారుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గేటు పుత్తూరులో పని ముగించుకుని రైల్వే ట్రాక్ దాటుతుండగా చెన్నై నుంచి తిరుపతి వెళుతున్న రైలు ఢీకొంది. దీంతో శ్రావణకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు రేణిగుంట రైల్వే పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ ఎంఎం ప్రేమ్‌చంద్‌కు డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి విద్య, ఆగస్టు 20 ప్రభాతవార్త :** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ ఎంఎం ప్రేమ్‌చంద్‌కు ఎస్వీయూ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ మేరకు బుధవారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీసర్ డాక్టర్ రాజమాణిక్యం నుంచి ఎంఎం ప్రేమ్‌చంద్‌కు ఉత్తర్వులు అందాయి. ఎంఎం ప్రేమ్‌చంద్ బిహేవియర్ ఆఫ్ సెల్ఫ్ కంపాక్టింగ్ కాంక్రీట్ ఆన్ అడిషన్ ఆఫ్ సప్లమెంటరీ సెమిన్‌టిష్యూస్ మెటీరియల్ ఇన్ ఓపీసీ, పీపీసీ అండ్ పీఎస్‌సీ సెమెంట్స్ అట్ డిపరెంట్ డ్యూరేషన్స్ ఆఫ్ మిక్సింగ్ అనే అంశంపై పరిశోధన చేసినందు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా తోటి స్నేహితులు, ఆ విభాగ ప్రొఫెసర్లు, శ్రేయోభిలాషులు పీహెచ్‌డీ అందుకున్న డాక్టర్ ఎంఎంప్రేమ్‌చంద్‌ను అభినందించారు. డాక్టర్ ఎంఎం ప్రేమ్‌చంద్ మరెన్నో అవార్డులు, రివార్డులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

## వైభవంగా శ్రీ వేణుగోపాల స్వామి వారి కళ్యాణం

రామచంద్రాపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త:



శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని నెత్తకుప్పం, రాయల చెరువు పేట, మిట్టవేపకుప్పం గ్రామాలలో శ్రీవేణుగోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుద్దీపాలు, చలువ పందిళ్ళతో అందంగా అలంకరించారు. స్వామి వారికి గ్రామస్థులు వివిధ రకాల సుగంధపరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, నూతన వస్త్రాలతో స్వామివారిని అలంకరించారు. రాజేష్ స్వామి వేదమంత్రోచ్చారణల నడుమ కళ్యాణోత్సవ తంతును పూర్తి చేశారు. నెత్తకుప్పంలో నిర్వహించిన కళ్యాణోత్సవానికి ఆకా హరిప్రకాష్ దంపతులు దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## ఈ పోస్ యంత్రాలకు స్వస్తి .. రేషన్ డీలర్లకు విముక్తి

చంద్రగిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త:

రేషన్ షాపుల్లో వినియోగిస్తున్న ఈ పోస్ యంత్రాలకు ప్రభుత్వం స్వస్తి పలకడంతో రేషన్ డాలర్లకు విముక్తి లభించిందని డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు చక్రవర్తి రెడ్డి అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు, పౌరసరఫరాల కమీషనర్ సౌరబ్ గౌరవ్‌కు బుధవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది మే నెలలో మంత్రి అసోసియేషన్లతో సమావేశమైన సమయంలో రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల శేషు సూచన మేరకు తనతో పాటు కార్యదర్శి రవిచంద్రారెడ్డి, కోశాధికారి రాజు మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఈ పోస్టు యంత్రాల వలన ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో మంత్రి, కమీషనర్ నూతన మిషన్ల ఏర్పాటుకై ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లో కసరత్తు మొదలుపెట్టి తాజాగా విజన్ టెక్ వి21 మోడల్ ఈ పోస్ డివైస్‌ను డీలర్లకు అందించనున్నట్లు తెలిపారు.తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, కమీషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

---

## రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు కృషి

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త

రైతుల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నా రని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కంగుంది రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక శాఖ అధ్వర్యంలో రైతులకు రాయితీతో మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పాడి రైతు లకు తక్కువ ధరలోనే పశువులకు దాణా లభిస్తుందన్నారు. దీ ం తో రైతులపై ఆర్థికభారం తగ్గుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో సిఎం చంద్రబాబునాయుడు పాడిపరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. ఆవులకు ఉచితంగా లింగనిర్ధారక వీర్యంను ఉచితంగా టీకాల రూపంలో అందించినట్లు తెలిపారు. తద్వారా ఆవులు పేయదూడలకు జన్మనిస్తాయన్నారు. రైతులు కూడా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, పార్టీ అధ్యక్షుడు షరీఫ్ పాల్గొన్నారు.

## బాబోయ్ కుక్కల బెడదను తప్పించండి:

శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో రోజు రోజుకు కుక్కల బెడద పెరుగుతుంది.ఈ నేపథ్యంలో కొత్తవారు సంచరించటం కష్టసాధ్యమైంది. అంతేకాక వీధుల్లో ముఖ్యంగా జయరామారావు వీధి, పెద్ద మసీదు వీధి,జిల్లా బాలికల ఉన్నత పాఠశాల, ఎస్‌డికె నగర్,హరహరబావి, ముత్యాలమ్మగుడివీధుల్లో కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు చెబుతున్నారు. అయితే అధికారులు జంతుసంరక్షణ అంటూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారనే అసంతృప్తి ప్రజల్లో చోటు చేసుకుంది.ఇప్పటికే బాధితులు కుక్క కాటు బారిన పడి ప్రభుత్వాసుపత్రికి మందుల కోసం క్యూకడుతున్నారు. కుక్కల కరచిన తరువాత బాధ పడే కన్నా ముందుజాగ్రత్తలు అవసరం కదా? ఈ ప్రాంతాల్లో కుక్కలు హఠాత్తుగా సైకిళ్ళు,ద్విచక్రవాహనాలపై వెళ్ళేవారిని తరుముకుంటున్నాయి.మున్సిపాలిటి అధికారులు స్పందించి కుక్కలను చంపకున్నా పట్టి దూర ప్రాంతాల్లో వదలిపెట్టాలని కోరుతున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో అతిథి

శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో బుధవారం కేంద్ర అడిషనల్ కార్యదర్శి కంపుడ్ కమిషనర్ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. అడిషనల్ కార్యదర్శి సంజీవ్ కుమార్ కుటుంబసభ్యులతో శివయ్య దర్శనానికి రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ మోహన్ సారధ్యంలో స్వాగతం పలికారు. వారికి ఏర్పాట్లను ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి సారధ్యంలో పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనంతో పాటు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఎఇఓ మోహన్ అందించారు.

## సిపాయిచే నిత్యావసర సరకుల సరఫరా

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 20 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం ఎండిపుత్తూరు పంచాయతీలోని మిట్ట ఇండ్లలో నివాసముంటున్న మహేష్ హఠాన్మరణం చెందినట్లు తెలుసుకున్న ఎంపి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గ్రామానికి చేరుకున్నారు.మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చారు. తన వంతు సహాయంగా సిపాయి భరోసా కింద 60 రకాల నిత్యావసర సరకులను అందించారు. ఆ కటుంబానికి ఎల్ల వేళల్లో అండగా ఉంటానని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ మోహన్‌ప్రియ, మండల వైకాపా ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి మునరత్నం రెడ్డి, బాలాజిరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, జిపి యాదవ్, సరస్వతి, వినోద్,వవెంకటేశ్, జ్ఞాన శేఖర్,రమేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన పెన్షన్లను వెంటనే పునరుద్దరించాలి!

సిపిఐ నిరసన



తొట్టంబేడు,ఆగస్టు 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొల గించిన వికలాంగుల పెన్షన్స్‌ను వెంటనే పునర్దురించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిపిఐ సారధ్యంలో ఆర్‌టిసి బస్టాండు సర్కిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. తొట్టంబేడు మండలంలో నిరుపేదలైన వికలాంగులకు అన్యాయం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఎహామీలను అమలు చేయటంలో విఫలమైందన్నారు. కూటమి హామీలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుపేదల ఆశలు అడియాసలయ్యాయన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హాయంలో ఇచ్చే పెన్షన్లను కూడా రద్దు చేయటం గమనిస్తే ఇంత కాలం వారు కూడా అనర్హులకే పెన్షన్లు అందించారా? అని ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం పునరాలోచించి వికలాంగులకు పెన్షన్లను పునరుద్దరించాలన్నారు. లేదంటే ఉద్యమాలు తప్పవన్నారు. ఈ నిరసనలో సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య,పట్టణ కార్యదర్శి రోడ్ల గోపి పట్టణ నాయకులు మురళి,జనార్ధన్,మునిరాజా,మహిళా సంఘ నాయకులు మునెమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ జయంతోత్సవాలు

తొట్టంబేడు,ఆగస్టు 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో రాజీవ్‌గాంధీ జయంతోత్సవాలను కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ బత్తెయ్యానాయుడు సారధ్యంలో నిర్వహించారు. పాతవరదయ్యపాళెం రోడ్డులోని పీపుల్స్‌క్లీనిక్‌లో నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం నెహ్రూకుటుంబం తమ ప్రాణాలను తృణ ప్రాయంగా త్యజించారన్నారు.నేడు ప్రజలు అనుభవిస్తున్న వెసులుబాట్లు నాడు రాజీవ్‌గాంధీ చొరవలే అన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసారన్నారు.ఈ కార్యక్రమాల్లో జనార్ధన్‌రెడ్డి,ఇర్లగోపి, సురేష్, అనిల్, నాగూరు, మోహన్, అర్ముగం, సరేంద్ర, నానమ్మ, భానుమతి, మస్తానమ్మ,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి: సిఐ

తొట్టంబేడు,ఆగస్టు 20 ప్రభాతవార్త



నేడు సమాజంలో యువతను తప్పు దారి పట్టిస్తున్న మాదక ద్రవ్యాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టూ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి పిలుపు నిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమైఖ్య తిరుపతి జిల్లా సారధ్యంలో యువతకు చైతన్య సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి కోగిలి మునిచంద్ర అధ్యక్షతన ఏర్పాటు చేసారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత అక్రమ సంపాదనలకు ఎలా పాల్పొడుతూ వారి భవష్యత్తును నాశనం చేసుకుంటున్నారనే అంశంపై చైతన్య పరచుటకు ఈ సమావేశాన్ని ఎస్‌సి బాయ్స్ హస్టల్‌లో ఏర్పాటు చేసారు. ముఖ్యఅతిథిగా యువతను చైతన్య పరచుటకు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆయన ఎస్‌సి హస్టల్‌లో సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను చైతన్య పరుస్తూ నేడు చాలా మంది యువత మాదకద్రవ్యాల వ్యసనంతో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వీటి వాడకంతో కొందరుమతి స్థిమితం కోల్పోతున్నారన్నారు. ఈ మత్తుతో చేయరాని పనులకు పాల్పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హస్టల్ విద్యార్థులకు వివరించారు. కొందరు ఈ వ్యసనానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. .ఈ కార్యక్రమాల్లో ప్రజానాట్యమండలి అధ్యక్షురాలు చారులత, అభి,సుమన్,డానియల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ జయంతి

తొట్టంబేడు,ఆగస్టు 20 ప్రభాతవార్త



మాజీ భారత ప్రధాని కాంగ్రెస్ రథ సారధి రాజీవ్ గాంధి జయంతిని శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ ఘనం గా నిర్వహించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలపా దామోదర్‌రెడ్డి సారధ్యం లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం నెహ్రూది అన్నారు. చిన్న వయస్సులో ప్రధాని పదవి చేపట్టి పేద ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంస్కరణలు చేపట్టారని దామోదర్‌రెడ్డి అన్నారు. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులను తెచ్చిన నాయకుడు నేడు ఏ చేతిలో చూసినా సెల్ ఫోన్ రూపకల్పన రాజీవ్ హయాంలోనే జరిగిందన్నారు.ఈ జయంతి ఉత్సవాల్లో సీతారాం, నాగరాజు,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 2కోట్ల విలువైన

# ఎర్రచందనం దుంగలు పట్టివేత

### 83 దుంగలతో పాటు లారీ స్వాధీనం- ఒక స్మగ్లర్ అరెస్టు

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 20, ప్రభాతవార్త

విజయవాడ – చెన్నై రహదారిలో లారీలో అక్రమంగా తరలిస్తున్న దాదాపు రెండున్నర టన్నుల ఎర్ర చందనం దుంగలతో పాటు లారీని స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లరును టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణతో టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గనిర్దేశకత్వంలో ఆర్ ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ ఎస్ ఐ కేఎస్ కె. లింగాధర్ టీమ్ మంగళవారం రాత్రి విజయవాడ –చెన్నై రహదారిలోని కావలి ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో కావలి వన్ టౌన్, టు టౌన్, కావలి రూరల్ సీఐ, ఎస్ ఐ ల సహకారంతో కె. బిట్రగుంట ఫారెస్ట్ బీటు పరిధిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు, ఒక లారీ వేగంగా రాసాగాయి. తనిఖీలను గమనించిన రెండు కార్లు యూ టర్న్ తీసుకుని వెళ్లగా, లారీ టాస్క్ ఫోర్స్ సిబ్బందిపైకి దూసుకుని వచ్చింది. అప్రమత్తమైన సిబ్బంది లారీని వెంబడించి ఆపగలిగారు. అంతలోనే లారీలో ఉన్న వ్యక్తులు కిందకు దూకి పారిపోసాగారు. అయితే ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. అతనిని హర్యానాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీలో 83 ఎర్రచందనం దుంగలు లభించాయి. వీటి విలువ రూ. రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వ్యక్తిని, దుంగలు, లారీని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. డిఎస్పీ వి. శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్‌లు నిందితుని విచారించారు. ఎస్ ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుపతి వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్

24, 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు

– శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు



తిరుపతి క్రీడ, ఆగస్టు 20, ప్రభాతవార్త

:తిరుపతిలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమరావతి ఛాంపియన్‌షిప్ 2025 పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిధ్యమిస్తుందని తెలియజేశారు. జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు చేరుకున్నారని వివరించారు. రాష్ట్ర స్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 2వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడా శాఖామంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడాశాఖ ఉన్నతాధికారులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీన విశాఖపట్టణంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఎం చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

## రైతులకు అన్నదాత సుఖీభవ నగదు చెక్కు పంపిణీ

కేవీబీ పురం, ఆగస్టు 20 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలంలో 7421 మంది రైతులకు రూ.5 కోట్ల 9వేలు అన్నదాత సుఖీభవ నగదుల చెక్కును సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పంపిణీ చేశారు. కేవీబీ పురం ఎంపీడీవో సమావేశ మందిరంలో అన్నదాత సుఖీభవ పథకం పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఏవో మురళీకృష్ణ, ఎంపీడీవో మాలతిలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7421 మంది రైతులకు రూ.5 కోట్ల 9 వేలు అన్నదాత సుఖీభవ నగదుల చెక్కును ఆయన పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతాంగానికి ప్రతిపాదించిన అన్నదాత సుఖీభవలో రైతులు ఆర్థికంగా ఎదిగేందుకుపంటలు పండించేందుకు తోడ్పడ్డారన్నారు. గ్రామాల్లో ఎక్కడికైనా సరే ఎవరైనా 24 గంటలు సరఫరా సప్లయ్ కాకపోతే వెంటనే నా దృష్టికి తేవాలన్నారు. స్త్రీనిధి జిల్లాలోని ఈ నియోజకవర్గానికి కోట్ల రూపాయలు మహిళలకు ఆర్థిక పరంగా మంజూరు చేయించానని తెలిపారు. సదరన్ సర్టిఫికెట్లను మానసిక వికలాంగులు, వికలాంగులకు ఇచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో కేంద్రాల్లో డాక్టర్ల వద్ద పొందే విధంగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోశయ్య, ఏవో మురళీకృష్ణ, ఎంపీడీవో మాలతి, ప్రకృతి వ్యవసాయ శాఖ కో–ఆర్డినేటర్ తిరుపతి లీలావతి, ఏపీవో భాస్కర్, సర్పంచ్‌లు పొన్నూరు బాలాజీ, మాజీ జడ్పీటీసీ వాసుయాదవ్, మాజీ ఎంపీపీ మనీ, ఆధరం మాజీ సర్పంచ్ సుదర్శన్‌నాయుడు, సీనియర్ టీడీపీ నాయకుడు ఏ.శివరాం, పరందామిరెడ్డి, పాలమంగళం డాక్టర్ రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సరస్వతి, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్‌వోలు, సంఘ మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాట్రపల్లి శ్రీదేవి భూదేవి ఆలయంలో హుండీ చోరీ

స్వామి,అమ్మవార్ల బంగారు నగలు అపహరణ



కేవీబీ పురం, ఆగస్టు 20 ప్రభాతవార్త:

మండలంలోని కాట్రపల్లి గ్రామ పంచాయతీ కాట్రపల్లి గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవిస్వామి ఆలయంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో గేట్ల బీగాలను కొట్టి గర్భగుడిలోని స్వామి, అమ్మవార్ల నగలను ఆలయంలో హుండీని తీసుకుని దక్షిణ ప్రహరీగోడ దాటి వెళ్లినట్టు అక్కడ స్థానికులు తెలిపారు. పురాతనవిగ్రహాలుగా ఉన్న శ్రీదేవి భూదేవి వైకుంతనాథ స్వామివారి విగ్రహాలకు, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర నాయకులు కోలా ఆనంద్, అదే విధంగా కృష్ణయ్య, గ్రామస్తులు అందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి పీఠాధిపతుల ద్వారా ఎంతో అత్యంత వైభవంగా ఆలయంలో పూజలు నిర్వహించేది. నిత్యం ఒకపూజారిని కూడా అక్కడ ఏర్పాటు చేసి ధూపదీప నైవేద్యాలతో అమ్మవారికి పూజలు జరిగేవి. హుండీని తీసుకెళ్లబయట ప్రాంతంలో పగులగొట్టి అందులో నగలను మాత్రం తీసుకోకుండా నోట్లో ఉన్న నగను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళుతున్నట్లు సీసీ ఫుటేజ్‌లో తెలిసిందని తెలిపారు. దీనిపై రాష్ట్రనాయకులు కోలా ఆనంద్ ఈ విషయాన్ని ఎస్పీకి తెలియజేయడంతో క్లూజ్ టీం వచ్చి వేలిముద్ర నిపుణులు తీసుకెళ్లారు. చోరీ చేసిన దొంగలను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## నారాయణవనంలో ఘనంగా జాతీయ దోమల దినోత్సవం

నారాయణవనం, ఆగస్టు 20 ప్రభాతవార్త :



జాతీయ దోమల దినోత్సవాన్ని నారాయణవనం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం ఉదయం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా వుండాలంటే దోమలను నిర్మూలించాలన్నారు. దోమ కాటు వల్ల ప్రజల ప్రాణాలు హరిస్తున్నట్టు గుర్తు చేశారు. దోమలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదామన్నారు. అనంతర ం నారాయణవనం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాగసుధ, సిహెచ్ఓ హరినాథ్, సూపర్‌వైజర్లు యశోదమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## గణేషుని విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పని సరి

నారాయణవనం, ఆగస్టు 20 ప్రభాతవార్త :



ఈనెల 27వతేది బుధవారం వినాయకచవితిని పురస్కరించుకొని విగ్రహాలు ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్థానిక ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాజకీయ ప్రేరేపిత, ఉద్దేశ్యపూర్వకమైనా పాటలను వేయరాదన్నారు. అలాగే అశ్లీల నృత్యాలకు అనుమతి లేదన్నారు. రాత్రి 10.30గంటల తర్వాత సౌండ్ సిస్టమ్‌ని నిలిపివేయాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## ఆకాష్ లో ఆంథే స్కాలర్ షిప్ పరీక్ష..



తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాత వార్త

స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆంథే2025 పేరుతో విద్యార్థులకు స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహించనున్నట్లు స్టేట్ అకడమిక్ ఆపరేషన్ హెడ్ ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం ఆకాష్ సంస్థలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు,మెరిట్ విద్యార్థులు తమ టాలెంట్ ను నిరూపించుకుని కోట్లలో స్కాలర్ షిప్పు పొందుతూ సంస్థలో ఐఐటీ,జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత కోచింగ్ పొందేందుకు సంస్థ అవకాశం కల్పించిందన్నారు.ఆన్లైన్లో అక్టోబర్4వతేదీ నుంచి 12 వరకు,ఆఫ్లైన్ ద్వారా అక్టోబర్ 5వ,12వ తేదీలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.విద్యార్థులకు కేవలం రూ.150 రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి విద్యార్థికి రూ.5వేల విలువగల ఆన్లైన్ స్టడీమెటీరియల్ అందించబడుతుందని తెలిపారు.ఈసమావేశంలో రీజనల్ సేల్స్ హెడ్ నిశాంత్ మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్, రీజినల్ మార్కెటింగ్ హెడ్ నరసిం హులు,బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం పాల్గొని ఆంథే స్కాలర్ షిప్ కు సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు.

## 1,15,000 విలువైన వస్తువులు పాఠశాలకు వితరణ..

తిరుపతి విద్య, ఆగస్టు 20 ప్రభాతవార్త:



స్థానిక బైరాగి పట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు లక్ష 15 వేల రూపాయలతో విలువగల కంప్యూటర్, ర్యాక్స్ ,బీరువా, టేబుల్ ను ఐడిబిఐ బ్యాంక్ ఎ జిఎం శ్యాంసుందర్ పాఠశాలకు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా డిఇవో మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి బ్యాంకు వారు ముందుకు రావడం అభినందనీయమని దీనిని అందిపుచ్చుకొని ఉపాధ్యాయులు మరింత చొరవ తీసుకొని విద్యార్థులందరికీ చదవడం రాయడం నేర్పించాలని ,డ్రాప్స్ లేకుండా చూసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ పల్లి .సురేష్ ,మేనేజర్ డి. రాజేష్ ,జిల్లాఐటీ సెల్ ధనంజేయులునాయుడు, భవిత కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ,క్లస్టర్ హెచ్ఎం టి .పరంధామనాయుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమాద్రి బాబు ,ఎంజీఎం హై స్కూల్ ఉపాధ్యాయులు బండి మధుసూదన్‌రెడ్డి,పి. రేణుకాదేవి, కదిరి రవి ,షబానా బేగం పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ రుక్మిణీ కల్యాణం



**పుత్తూరు రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతా మందిరంలో శ్రీకృష్ణాష్టమి మహోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు,అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయంలో శ్రీ రుక్మిణీ కల్యా ణం, అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శ్రీ గీతాసేవా సమాజం పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ : ఎంపిపి



సూళ్లూరుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: మండల పరిధిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలని ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిచిన సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. మండల పరిధిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అధికారులు, అక్కడి ప్రజలు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. డ్రైనేజీలు, రోడ్లు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలని తెలిపారు. రూరల్ పరిధిలో మంజూరైన పక్కా ఇళ్లు ఎంతవరకు పూర్తయ్యాయో వాటి వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీకృష్ణ, తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంచి కార్యకర్తను కోల్పోయాం : ఎమ్మెల్యే



కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని మద్దాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కాకాణి వెంకటరమణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ మేరకు బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మద్దాలి గ్రామానికి విచ్చేసి కాకాణి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, కొత్తపాలెం గ్రామ జలసంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, ఎంపిటిసి దారా సురేష్, జితేంద్రరెడ్డి, మర్రి పోలయ్య తదితరులు ఉన్నారు.

## కాకాణిని కలిసిన వైసీపీ నాయకులు



కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త: నెల్లూరు సెంట్రల్ జైలులో దాదాపు 84 రోజుల పాటు వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంతో బుధవారం విడుదలయ్యారు. ఈ క్రమంలో కోట మండలం విద్యానగర్‌కు చెందిన వైసీపీ యువ నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, మరికొంతమంది వైసీపీ నాయకులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు.

## ప్రతి కుటుంబంలో దోమతెరలు వాడాలి



కోట, ఆగస్టు 20 ప్రభాతవార్త: మండలంలోని ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా దోమతెరలను వాడాలని చిట్టేడు ఆరోగ్య ఉప కేంద్రం వైద్యులు డాక్టర్ నాగరాజు సూచించారు. బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా చిట్టేడు గ్రామంలో డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య భద్రత అనే సంకల్పంతో దోమలు లేని గ్రామంగా కృషి చేస్తామని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తనవంతు పాత్ర పోషిస్తానని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఎలక్ట్రికల్ బ్యాట్లు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రైతులకు పంట నమోదు తప్పనిసరి : ఏడిఏ



పెళ్లకూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని నెలబల్లి గ్రామంలో బుధవారం నాడు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ నాగార్జునసాగర్ మరియు ఏవో విజయభారతి పాల్గొని రైతులకు పంట నమోదు యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించడంతో పాటు పచ్చి రొట్టె ఎరువుల యొక్క ప్రాముఖ్యతను రబీ సీజన్లో మేలైన వరి వంగడాలు గురించి రైతులకు తెలియజేశారు. రైతులు యొక్క పంట పొలాలను పరిశీలించి అనేక రకాల తెగుళ్ల గురించి వివరించడంతో పాటు ఎక్కువ దిగుబడిని ఎలా రాబట్టాలి అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ పెంచలమ్మ మరియు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆయన తీసుకొని వచ్చిన సాంకేతిక విప్లవాన్ని నేడు అనుభ విస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల చంద్రశేఖర్, రాష్ట్ర బిసి సంఘం నాయకులు గుంటమడుగు సుబ్బరామరాజు, రావూరి బ్రహ్మయ్య, చిల్లకూరు మండలం అధ్యక్షుడు చిలకూరి వేమయ్య, నాయకులు మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పుదూరులో పొలం పిలుస్తోంది



నాయుడుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త ; మండలంలోని పుదూరు,పూడేరు గ్రామాల్లో నాయుడుపేట ఏడి నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడి నాగార్జున సాగర్ మాట్లడుతూ గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా పంటన మోదు చేసుకోవాలని సూచించారు. ఈవిధంగా పంట నమోదు చేయడం వల్లన ప్రకృతి వైపరి త్యాల వల్లన పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం అందించే సబ్సిడీలు ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. అనంతరం వ్యవసాయసాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలుసూచనలు,సలహాలు తెలియజేశారు.గ్రామాల్లో రైతులకు జీలుగలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి గణేష్, విఎఎలు,రైతులు,తదితరులు పాల్గోన్నారు.

## పేటలో ఘనంగా కమిషనర్ జన్మదినం



నాయుడుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా జన్మధిన వేడుకలను అధికారులు బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సి పాల్టీ కమిషనర్‌కు పలువురు అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ,గూడూరు కిషోర్‌యాదవ్, మాజీ ఎఎంసి డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి,శ్రీపోలేరమ్మ ఆలయకమిటి చేర్మేన్ నానబాల సుబ్బారావు, మల్లాం రవికుమార్,మున్సిపాల్టి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: గూడూరు ప్రభుత్వ డి.ఎల్.టి.సి/ఐ.టి.ఐ. గూడూరు నందు 2025-26 విద్యా సంవత్సరంకు గాను సైంటిఫిక్ గ్లాసు, నియాన్ సైన్ ట్రేడ్ నందు ఖాళీ అయిన సీట్లుభర్తీ చేయుటకు ధరాఖస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఐటీఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్.ఏ.సి) వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్ధులు హెచ్‌టిటిపి://ఐటిఐ. ఎన్ఏసి.ఇన్ అనే వెబ్సైట్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 26వ తేది లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29వ తేది గూడూరు ప్రభుత్వ డి.ఎల్.టి.సి./ఐ.టి.ఐ నందు వారి యొక్క ఒరిజనల్ సర్టిఫికెట్‌లు తీసుకొని వచ్చి వెరిఫికేషన్‌కు రావాలని పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలి : సీపీఐ



గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: నిలిపివేసిన వికలాంగుల పెన్షన్లను పునరుద్దరించాలని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద సీపీఐ గూడూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లను పలు రకాల కారణాలతో తిరుపతి జిల్లాలో సుమారు 33 వేల మంది పెన్షన్లను రద్దు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను కుదించేందుకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. నిలిపివేసిన వికలాంగుల పెన్షన్‌లను మంజూరు చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజవర్గ అధ్యక్ష కార్యదర్శులు సివిఆర్ కుమార్, నారాయణ , వెంకటయ్య ,సుబ్రమణ్యం, నాగార్జున, వెంకీ, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారవేత్తలు చేయడమే లక్ష్యం:ఐఐసి కన్వీనర్



గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: పట్టణంలోని ఆదిశంకర డీమ్డ్ టూ బి యూనివర్సిటీలో విద్యార్థి ఆవిష్కరణోత్సవం 2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఐసి కన్వీనర్ ప్రణయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదువుకొని, జీవితంలో ఉన్నత స్థానంకి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీమ్డ్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజయ్య, డాక్టర్ టిపి శశి కుమార్, డా. కె ధనుంజయ, డా. జె. వైఎన్ నాయుడు, సురజ్ మండల్, సాయినాథ్, నీలా మణికంఠ, సాయి కిరణ్, ఏవో రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: పట్టణంలోని సివిఎస్ పార్క్ వద్ద ఉన్న ప్రసాదు ట్రేడర్స్ ముందు ఒక గుర్తు తెలియని సుమారు 45-50 వయసు గల మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఒకటవ పట్టణ ఎస్ఐ తిరుపతయ్య కథనం మేరకు మృతుని గురించి ఆరా తీయగా అతనికి సంబంధించిన వారు ఎవరు లేరని అతను గత కొంతకాలంగా పట్టణంలో చిత్తు కాగితాలు, ఖాళీ వాటర్ బాటిల్స్ ఏరుకొని ఇనుప సామాను అంగళ్లలో వేసి వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఎక్కడపడితే అక్కడ పండుకొని నిద్ర పోయేవాడిని విచారణలో తేలిందన్నారు. అతని ఆచూకీ తెలిసిన యెడల గూడూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9490413803, సబ్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440796 342కు తెలియజేయడం తెలియజేయవలసిందిగా పేర్కొన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## లయన్స్ క్లబ్‌చే విద్యా సామాగ్రి పంపిణీ



గూడూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గూడూరు మండలం విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హై స్కూల్ నందు చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు 45 మంది విద్యార్థులకు స్టడీ చైర్లు, ప్యాడ్లు, విద్యార్థుల కొరకు లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అందజేసారు. ఈ కార్యక్రమాని దాతల సహాయంతో పిల్లలకు ఈ వస్తు సామాగ్రి ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అక్కన రమణయ్య మాట్లాడుతూ లైన్స్ క్లబ్ చదువుకు, వైద్యానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడానికి ఎన్నో విధాలుగా ముందుంటుందని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకొని భవిష్యత్తును ఆనందంగా తీర్చిదిద్దుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్స్ ఎంజెఎఫ్ మల్లెమాల మురళి రెడ్డి, ఎంజెఎఫ్ లయన్ రామ్మోహన్ రావు, లయన్ రూపేష్‌రెడ్డి లయన్ కలగట్ల శివయ్య లయన్ జక్కంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లయన్ జోసెఫ్, లైన్స్ క్లబ్ సభ్యులందరూ ఈ కార్యక్రమాన్ని పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమాన్ని గూడూరు లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీ ట్రెజరర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## పుషఫిత్ కంపెనీలో యువకుడు మృతి



శ్రీకాళహస్తి, ఆగస్టు 20 ప్రభాతవార్త: పుషఫిత్ కంపెనీలో పని చేస్తున్న మేర్లపాక నివాసి మహేష్ డ్యూటీలోనే సొమ్మసిల్లి పడిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే ఓ హాస్పిటల్‌కు తరలించినా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించడంతో, ఆవేదన చెందిన కుటుంబ సభ్యులు కంపెనీ యాజమాన్యం వారిని నిలదీయండి జరిగిందన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

## కోక్-కోలా టీమ్ లీడర్ గుండెపోటుతో మృతి!



శ్రీకాళహస్తి, ఆగస్టు 20 ప్రభాతవార్త: స్థానిక కోక్‌కోలా కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న ఎం.ప్రకాష్ (46) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన ఇంటిలో యథాప్రకారంగా రాత్రి డ్యూటీకి వెళ్ళడానికి తయారౌతున్న సందర్భంలో స్పృహతప్పి పోవడం జరిగిందని, వెంటనే స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్ళడం జరిగిందన్నారు. అయితే అప్పటికే ప్రకాష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు వివరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నట్లు తెలిపారు. స్థానికులు,కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## 267 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 20 ప్రభాతవార్త: నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్ల లో స్థలాలు కోల్పోయిన 267 మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టిడిఆర్ కమిటీ సభ్యులు ఆన్లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామని అన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా బుధవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. డిసిపి ఖాన్, ఏసిపిలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త : మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగకు చెందిన గిరిజనుల కుటుంబాలకు బుధవారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సారథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. పుల్లారెడ్డి కండ్రిగకు చెందిన వెంకటేశ్వర్లు జీవనోపాధికి వెళ్ళి రోడ్డు ప్రమాదంలో మరణించారు. మామిడి కోతకు వెళ్ళిన ఏడుగురు రోడ్డు ప్రమాదంలో చనిపోగా వారిలో శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగకు చెందిన వెంకటేశ్వర్లు తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆతని కుటుంబానికి ఆర్థిక సహాయం అ ందించాలని సిఎంకు మొరబెట్టుకోగా మంజూరు చేసారు. ఈ చెక్కు రూ.3లక్షలు వెంకటేష్ కుమార్తె బత్తెమ్మకు జిల్లా కలెక్టర్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్ పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ భూములకు...అటవీశాఖకు గ్రీన్ సిగ్నల్



శ్రీకాళహస్తి,ఆగస్టు 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ గ్రామస్థులు, అటవీశాఖ అధికారులు మధ్య సుమారు 55 సంవత్సరాలుగా జరుగుతున్న వివాదానికి బుధవారం స్థానిక శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్, జిల్లా అటవీశాఖాధికారి వివేక్‌లు తెర వేసారు. ఈ సమస్య జటిలంగా మారింది. పరిపాలనకు సవాలుగా మారిన సమస్యను ఎంతో సున్నితంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పరిష్కరించారు.ఈ సమస్యను పరిష్కరించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రత్యేకంగా జిల్లా అధికారులను ఆహ్వానించారు. సింహాచల కండ్రిగ దళిత వాడలకు సంబంధించిన 93 మందికి పూర్వం పట్టాలిచ్చినట్లు ఉంది,అయితే ఈ పట్టాలను రద్దు చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉండటంతో ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించుటకు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ నేపథ్యంలో సింహాచల కండ్రిగ లోని పట్టాదారులను కకూడా ఆహ్వానించారు.ఈ సమావేశంలో పట్టాలున్న ట్లు చెబుతున్న వారి బాధలను కలెక్టర్ విన్నారు. అయితే ఎవరికి ఇబ్బంది లేకుండా 'సింహాచల కండ్రిగలో పట్టాలున్నట్లు చెబుతున్న వారికి 'ప్రత్యామ్నాయ భూములివ్వటానికి' హరిత అభివృద్ధి కింద అటవీశాఖకు మంజూరు అయిన నిధులను సద్వినియోగం చేసుకొనుటకు నిర్ణయించారు.

**అసలేం జరిగింది!**

శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగలో చోటు చేసుకున్న వివాదాన్ని పొడిగించకుండా ఉండటానికి ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి చొరవ చూపారు. దాంతో ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, డిఎఫ్ఓ వివేక్‌లతో చర్చించారు. సుదీర్ఘ చర్చ తరువాత జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డిలు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు రెవెన్యూ పంచాయతీలోని సింహాచల కండ్రిగ వద్ద 50 సంవత్సరాలుగా అటవీశాఖ గ్రామస్థులకు మధ్య వివాదం నడుస్తుందన్నారు. దానిని అందరి వాదనలు విన్న తరువాత నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.ప్రస్తుతం వివాదాస్పదమైన భూములను ప్రభుత్వం 1970లోనే రిజర్వ్ అడవిగా నమోదు అయినట్లు వివరించారు. అయితే ఏ ప్రాతిపదికను పట్టాలు ఇచ్చారో ఏమో కాని వాటిని రద్దు కూడా చేసినట్లు వారు వివరించారు.ఈ సమస్యపై 2010లో రైతులుకోర్టును ఆశ్రయించి పిటిషన్‌దాఖలు చేసారన్నారు. 2014లో కోర్టు కూడా అవి రిజర్వ్ ఫారెస్టు భూములని రెవెన్యూశాఖ ఇచ్చిన పట్టాలను రద్దు చేసారన్నారు.

**రాజీ ఇలా జరిగింది :**

బుధవారం జిల్లా యంత్రాంగాన్ని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తికి రప్పించారు. వివాదం చోటు చేసుకున్న రెవెన్యూశాఖ తరపున జిల్లా కలెక్టర్, అటవీశాఖ తరపున డిఎఫ్ఓ వివేక్‌లను ఆహ్వానించారు. బాధితులను కకూడా హాజరు పరచారు. ప్రభుత్వాధికారులు, స్థానిక నాయకుల మధ్య జరిగిన చర్చల్లో నాడు పట్టాలు పొందిన రైతులకు 'సాగుభూమి పట్టాలు ప్రత్యామ్నాంగా సమీపంలో ఇవ్వటానికి' సమావేశంలో రెవెన్యూశాఖ తరపున కలెక్టర్ భరోసా ఇచ్చారు. అటవీశాఖాధికారులకు మంజూరు అయిన రూ.62 లక్షల నిధులతో హరితవనం అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. వారి పనులకు సింహాచల కండ్రిగ నుంచి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరని పనులకు ఆటంకం కల్గించరని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో అధికారులతో పాటు బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, రంగినేని చెంచయ్యనాయుడు, కామేష్‌యాదవ్,ఈశ్వర్‌రెడ్డి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్,అటవీశాఖాదికారి లోకేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు

## అభివృద్ధి పనుల పురోగతిపై ఎంఎల్ఏ సునిశిత పరిశీలన



చంద్రగిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త: చంద్రగిరిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని బుధవారం ఎంఎల్ఏ పులివర్తి నాని సునిశిత పరిశీలన చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణంలో రెండవ ఫ్లోర్ మోల్డింగ్ పనుల పరిశీలనకు విచ్చేసిన ఆయన పార్టీ నాయకులతో ప్రత్యేక పూజలు చేయించారు. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. ఈ సందర్భంగా పిఆర్ డిఈ మురళి పనుల పురోగతిని ఆయనకు వివరించారు. భవనంలోని గదులను పరిశీలించిన ఎంఎల్ఏ పలు సూచనలు చేశారు. నిర్దేశిత సమయానికి భవన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడి నుండి గోవింద ధామంకు చేరుకున్న ఎంఎల్ఏ అక్కడ కమిటీ సభ్యులతో పనుల పురోగతిపై చర్చించారు. మరింత వేగవంతంగా పనులు చేపట్టాలని సూచించారు. దాతల సహకారంపై ఆరా తీశారు. అక్కడి నుండి బిసి బాలురు (డిగ్రీ) హాస్టల్‌ను, ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని వెల్ఫేర్ ఆఫీసర్‌కు సూచించారు. అక్కడి నుండి రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న ఎంఎల్ఏ నిర్మాణ దశలో అసంపూర్తిగా ఆగిపోయిన రెవెనూ య కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. మరో నాలుగు మాసాలలో భవన నిర్మాణ పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరైనట్లు వివరించారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయ భవనాలను ఒకే రోజున ప్రారంభించే విధంగా ప్రణాళిక రూపొందిచుకోవాలన్నారు. అభివృద్ధి పనులపై ఎంఎల్ఏ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండటంతో నిర్దేశిత సమయానికి ముందే పూర్తి చేసే దిశలో పనులు సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ వెంకటరత్నం, పిఆర్ ఏఈ రాజాజీ డిసిఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ గౌసెభాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, జనసేన నాయకుడు తపసి మురళి రెడ్డి, నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, ముద్దికుప్పం రామమూర్తి, శుభగిరి నాయుడు, అగరాల జయచంద్రారెడ్డి, ప్రభాకర్ నాయుడు, ఓంకార్ భరద్వాజ్, నాగరాజ నాయుడు, పులికంటి మోహన్ రెడ్డి, సునీత, సునీల్, మంగాపురం లోకేశ్వరీ భాస్కర్ రాయల్, నాయుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండప నిర్వాహకులు...నిబంధనలు పాటించాలి

-సింగిల్‌విండో పద్ధతిలో మండపాలకు అనుమతి -వినాయకసాగర్‌లో పూర్తిస్థాయి ఏర్పాట్లు



తిరుపతికార్పొరేషన్, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో వినాయకచవితి పర్వదినాన్ని ప్రశాంతంగా, భక్తిపూర్వకంగా జరుపుకోవాలని వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ సూచించింది. నగరంలో వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, సింగిల్ విండో విధానం ద్వారా మండపాలకు వినాయక కమిటీ కార్యాలయం అనుమతించడం జరుగుతందని కన్వీనర్ సామంచి శ్రీనివాస్ తెలిపారు. వినాయకవిగ్రహాల నిమజ్జనం చేసే వినాయకసాగర్‌లో పూర్తిస్థాయి ఏర్పాట్లుచేపడతామని నగరపాలక కమిషనర్ మౌర్య తెలిపారు. వినాయకచవితి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ప్రశాంతవాతావరణంలో భక్తితో జరుపుకునేందుకు మహోత్సవ కమిటీ సహకరిస్తుందని సామంచి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం ఇందిరామైదానంలో వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ కార్యాలయం ప్రారంభమైంది. మట్టివినాయకులనే పూజిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, నగరపాలక కమిషనర్ మౌర్య, వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు గుండాల గోపీనాధరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ నాయుడు, అన్నాఅనిత, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌స్వామి, కెఎన్‌రాజ ,నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దచెరువు అక్రమణలపై కఠిన చర్యలు : డిఆర్ఓ



పలమనేరు టౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త: పలమనేరు పెద్దచెరువు ఆక్రమణలపై కఠిన చర్యలు గైకొంటామని డిఆర్ఓ మోహన్‌కుమార్ తెలిపారు. కొందరు రైతులు పెద్దచెరువు కట్టకు గండికొట్టి రాజుకాలవను ధ్వంసం చేసిన దృశ్యాన్ని తహసీల్దార్ ఇన్బునాదన్, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. చెరువును సర్వే చేయించి ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాజుకాలువ ధ్వంసం చేయడంతో చెరువు నీరు దాదాపు 75 శాతం వృధా అయిందని, ఈ నీరంతా పంట పొలాలపై వెళ్ళి రైతులు పంటలు నష్ట పోయారని తెలిపారు. జరిగిన నష్టాన్ని అంచనావేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. అలాగే పెద్దచెరువు మొరవనీరు చేరే బొమ్మదొడ్డి చెరువును కూడా పరిశీలించారు.

## డ్రోన్లతో గుర్తింపు,పేకాట శిబిరాలపై దాడులు



శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలో మేర్లపాక, బండారుపల్లి, ముసలిపేడు కందాడు, రామలింగా పురంలలో డివైయస్‌పి శ్రీనివాసులు డ్రోన్ కెమెరాలతో పేకాట శిబిరాలు గుర్తించి భారీ ఎత్తున నగదు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచిస్తున్నారని ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. ఏర్పేడు ఎపోలీసులు దాడులు జరపగా డ్రోన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షించారు. పేకాట శిబిరాలను గుర్తించారు.ఈ మేరకు దాడులు జరుపగా 12సెల్‌ఫోన్లు, నాలుగు మోటార్ సైకిళ్ళు రూ.2.36 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో డ్రోన్స్‌ను ఉపయోగించాలని జిల్లా ఎస్పి సూచించారు. ఈ నేపధ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పేడు పోలీసులు అమలు చేసారు. ఈ సంఘటనల్లో 11 మంది అదుపులో తీసుకున్నట్లు సిఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వీరిలో కడప జిల్లాకు చెందిన ఐదుగురు,అన్నమయ్యజిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరుకు చెందిన ఇద్దరు కలకడ కు చందిన ఒకరు ఉన్నారని సిఐ తెలిపారు. ఇంకా తొమ్మిది మంది పరారులో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.


IN THE COURT OF PRINCIPLE CIVIL JUDGE(SENIOR DIVISION OF CHITTOOR.
O.E.P.No. 2 of 2025
O.S.No. 17 of 2020

Between:
L.Rajendra Naidu ..Decree- holder
And:
N.Vasantharaja Naidu ...Judgment debtor.

**AUCTION NOTICE:**
The below mentioned properties of the Judgment debtor will be sold in public auction on 10-09-2025 in this court from 10-30 A.M. to 5-00 P.M. for realization of decreetal amount. The intending bidders may participate in the public auction in the above said date and time.

**SCHEDULE:**
Chittoor District- Bangarupalyem sub District -Bangarupalyem Mandal - Thumpayanapali Grama Panchayat - Thumpayanapali Village Accounts:-
1. Sy. No. 136/5 - Dry -Extent Acres 0.76 cents or 0.204 Hectors or 33105.6 Sq. feet or 3678.4 Sq. yards full land.
2. Sy. No. 136/3, dry extent Ac. 0.05 cents or 0.020 hectors of 2178 Sq. feet or 242 Sq. yards full land.
The said lands are situated within the following boundaries:-
East: Land of Vema Naidu, West: Earlier land of K. Gopal Naidu, now SC Colony, North: Land of L. Vema Naidu, South: Earlier land of L. Venkatapathi Naidu now leading to SC Colony.
Within these boundaries cement sheet shed full, its shutters, doors, door frames, electricity service connection.
Decree holder Value : Rs. 30,00,000/-
Sub-registrar Value: Rs. 50,63,040/-
Amin's Value: Rs. 32,00,000/-
E.C: The J.Dr. has mortgaged the property mentioned above to D.Hr. L.Rajendra Naidu under regd simple mortgage deed dated 24-07-2015

V.UDAYA SANKAR,
Advocate for Decree Holder
Chittoor, Date :19.08.2025